బత్తయ్య పైకిలేచి "తేజూ పెండ్లాంను పలకరించినాడా లేదా?" అని అడుగుతూ చిలిపి నవ్వునవ్వాడు.

"వుస్ కో బహుత్ షరమ్ అన్నా! మేము వుండేదాంకా శిర్ పైకెత్తలేదు..." అంటూ ఫరూఖ్ గొల్లున నవ్వాడు.

"అబ్ భయ్యా కాఖేల్ ఖతమ్... బాబీ కా ఖేల్ షురూ... భయ్యాకా ఖేల్ ఖతమ్.. బాబీ కా ఖేల్ షురూ..." సల్మాన్ మళ్లీ పెద్దగా పాడసాగాడు.

"మొగుడూ పెండ్లా కొట్లాట యెంచేపులే... యీ వరకు అంతా సద్దుమణిగి పొయ్యుంటాది. పొద్దన్నించీ మీతో గూడా పనిచేసి వొళ్ళంతా అలిసి పొయ్యింది. నేను గూడా పడుకుంటాను.. తెల్లారితో టేషన్‌కు పొయ్యేటప్పుడు చెప్పేసి పోండి" అని మాట్లాడుతూనే బత్తయ్య గుడిసెలోకెళ్ళిపోయాడు.

"అబ్ వాచిమేన్ కా ఖేల్ ఖతమ్... వున్ కా బీవీకా ఖేల్ షురూ..." అంటూ సల్మాన్ పాడసాగాడు.

రొట్టెల కంచాన్ని గుడ్డతో కట్టేశాక, పక్కకు జరిపి "అబ్ మైబీ సోనా!" అన్నాడు ఫరూఖ్ పడుకుంటూ.

జిప్‌బాగ్ పైన తలపెట్టుకుని పడుకున్న ముదస్సర్‌కేసి చేయి చాపుతూ, "వో దేఖో... వో కల్ సవేరే జానేవాలా... అబ్ కైసే సోతాహై దేఖో" అంటూ సల్మాన్ యెగతాళి చేశాడు.

వుత్తరాన కొండలు చీకటిలో కలసిపోవడంతో నడకదారి వెంట వెలుగుతున్న దీపాలు ఆకాశంలోకి పారిపోతున్నట్టుగా కనబతున్నాయి. చీకటి పరచుకున్న వూరిలోపల వెలుగుతున్న వీధి దీపాలు నల్లటి వలలో తగులుకున్న పావురాయిల్లా బిక్కుబిక్కు మంటున్నాయి. ఆకాశంలో చుక్కలు దారితప్పి నిలబడిపోయాయి. వూరి బయట కొత్తగా విస్తరిస్తున్న కృష్ణానగర్‌లో యిప్పుడిప్పుడే కడుతున్న యిండ్లు చీకటితో వొద్దికగా సంసారం చేస్తున్నాయి. యింకా పూర్తిగాని యిండ్లను గుడ్డిదీపాలు పహారా కాస్తున్నాయి.

నడిరాత్రి మెలకువ వచ్చినప్పుడు గుడిసెలోంచీ బయటికొచ్చాడు బత్తయ్య. వరండాలో పడుకున్న ముగ్గురు యువకుల శరీరాలూ గురకలు తీస్తున్నాయి. ముదస్సర్ తల జిప్‌బాగ్ పైన్నుంచీ కిందికి దొర్లిపోయివుంది. ఫరూఖ్ నిద్రలోనే పలవరిస్తున్నాడు. సల్మాన్ నోరంతా తెరచుకుని, జొల్లు కారుతుండగా గురకపెడుతున్నాడు. బత్తయ్య యింటి చుట్టూ రెండు ప్రదక్షిణాలు చేశాక, నిట్టూరుస్తూ జిప్‌బాగ్ తీసుకుని గుడిసెలో కెళ్ళిపోయాడు.

వుత్తరాన ఆకాశంలో కెళ్తున్న దీపాలు జాగారం చేస్తూనే వున్నాయి. వూరిని కప్పిన దీపాలకాంతి పొగమంచుగా మారి వణుకుడు తెప్పిస్తోంది. యింటి చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కల మధ్య కీటకాలు వేటాడుకుంటున్నాయి. యింటిలోపల వరండాలో గుడ్డి విద్యుదీపం దగ్గర బల్లులూ, రెక్కల పురుగులూ దాగుడుమూతలాడుకుంటున్నాయి. మాటు మణిగిన వూరిలోపల రైళ్ళుమాత్రం కాలాన్ని లెక్కబెడుతున్నట్టుగా కూతలు కూస్తూనే వున్నాయి. తూర్పున ఆకాశంలో నలుపురంగు గాఢమైన నీలంరంగులోకి మారుతోంది.

బయటినుంచీ కలకలమేదో చెవులకు సోకగానే, నిద్రపోతున్న బత్తయ్య వులిక్కిపడి, ధిగ్గున లేచి కూచున్నాడు. యెవరో మెడబట్టుకుని గెంటినట్టుగా గుడిసె బయటికి విసురుకొచ్చాడు. నీడలాంటి ఆకారమొకటి ప్రహరీదాటి రోడ్డుపైకి పరిగెడుతూ కనిపించింది.

వరండాలో పడుకున్న ఫరూఖ్ పక్కన గొంతుక్కూచున్నసల్మాన్ "అన్నా! అన్నా! ఫరూఖ్... హోగయా! పూరా గజబ్ హోగయా! వో ముదస్సర్ సైతాన్ అన్నా! వో యిస్‌కో మారా! ఖూనీ కర్‌దియా అన్నా! అల్లా! మైక్యాకరూం అల్లా!" అంటూ పెద్దగా యేడవసాగాడు.

వూడిపోతున్న పంచను గట్టిగా పట్టుకుంటూ బత్తయ్య వొక గెంతుతో వరండాలోకి దూకి, ఫరూఖ్ కేసి చూశాడు. నుదుటిపైన్నుంచీ కారుతున్న రక్తంతో ఫరూఖ్ తలవెంట్రుకలు తడిసిపోయి వున్నాయి. అతడి ముఖంలో నివ్వెరపాటు అలాగే నిలబడిపోయివుంది. కనురెప్పలు మూతబడుతున్నాయి. పెదవులు టపటపా కొట్టుకుంటున్నాయి. అరిచేతులు తెరుచుకుంటూ మూసుకుంటూ అల్లల్లాడుతున్నాయి. పాదాలు విలవిలా కొట్టుకుంటున్నాయి.

"వో ముదస్సర్ యిస్‌కో మార్‌కర్ దౌడ్ దియా అన్నా! యే మర్‌గయా అన్నా! మై క్యా కరూం అల్లా!..."సల్మాన్ చేతులు పెద్దగా తిప్పుతూ, నోరంతా తెరిచి పెద్దగా యేడవసాగాడు. పూరింటిలోంచీ లేచి బయటికొచ్చిన బత్తయ్య భార్య నిశ్చేష్టురాలై నిలబడిపోయింది.

వంగి ఫరూఖ్ చేయిపట్టుకున్నాక "గొమ్మునుండు... యింగా బతికే వుండాడు... బిన్నాగా ఆస్పత్రికెత్తుకోని పోతే బతికిపోతాడు... ఆటోనో రిక్షానో తేపో..." అని అరిచాడు.

"యీ టయింలో యిప్పుడు ఆటో, రిగ్షా ముష్కిల్ అన్నా! యే మర్‌గయా అన్నా!" సల్మాన్ మాటలు యేడుపుతో కలిసి ముద్దముద్దగా వెలువడసాగాయి.

"యేమే! ఆపక్క కలుజు దగ్గిర వాచ్‌మేన్‌కు రిగ్షా వుండాల ...పొయి చూడు" అని భార్యను కేకేశాడు బత్తయ్య. ఆమె చీకటిలోనే ముందుకు పరిగెత్తింది. బత్తయ్య సవకాన్ని తడిపి ఫరూఖ్ తలకు బిగించి కట్టాడు. అతడి శరీరాన్ని పైకెత్తిపట్టుకున్న సల్మాన్ తన చేతులు రక్తంతో తడిసిపోవడం కనిపించగానే, యెలుగెత్తి యేడవసాగాడు.

"ముందు సైకిలు స్టాండు తియ్యి. యెనకాల కుచ్చో బెడతాను. నువ్వు పడిపోకుండా పట్టుకో... నేను హేండలు పట్టుకోని తోస్తాను. ఆస్పత్రికి బిన్నాగా చేర్చాల..." అని పురమాయించాడు బత్తయ్య.

స్టాండుపైన కూచోబెట్టిన ఫరూఖ్ శరీరం విరిగిన మునగకొమ్మలా వాలిపోతోంది. బత్తయ్య బలాన్నంతా వుగ్గబట్టుకుని సైకిలు ముందుకు నెట్టాడు. వాలిపోతున్న ఫరూఖ్ శరీరాన్ని గట్టిగా పట్టుకుంటూ సల్మాన్ యేడుపు కొనసాగించాడు. చీకటిని నెడుతున్న నీడల్లా మూడు ఆకారాలూ ముందుకు కదిలాయి.

కలుజుదగ్గర వాచ్‌మేన్ భార్యతో బాటూ యెదురొచ్చిన బత్తయ్య భార్య "ఆ మడిసి లేడు మామా! వూరికి పొయినాడంట! రిగ్షామాత్రం వుండాది" అని అరిచింది.

"రిగ్షా నిట్ల తోసకరా!" గసబోస్తూ అరిచిన బత్తయ్యగొంతు పులిపైన దూకుతూ అరిచిన జింకపిల్ల కేకలా బీభత్సంగా ప్రతిధ్వనించింది.

"టైర్లలో గాలుండాదో లేదో!" అంది కలుజుదగ్గరి వాచ్‌మేన్ భార్య కంగారుగా.

ఆమె మాటలు వినబడనట్టుగా బత్తయ్య యెడమచేత్తో ఫరూఖ్‌ను పట్టుకున్నాక, హేండలు పైన్నుంచీ కుడిచేతిని తీసేశాడు. సైకిలు అలాగే దప్పుమని కిందపడిపోయింది. సల్మాన్ మరోవైపు పట్టుకుని యెత్తుకోగానే, బత్తయ్య ఫరూఖ్ శరీరాన్నలాగే రిక్షాసీటులో

